సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

సోమవారం । 28 । ఏప్రిల్ । 2025



'ఏకలవ్య' సిద్ధం!

నాలుగేళ్ల క్రితం ప్రారంభించిన ములకలపల్లి ఏకలవ్య మోడల్ స్కూల్ భవన నిర్మాణం పూర్తయింది. 8లో



పాడి, పాలు సమృద్ధి..

చిన్న, సన్నకారు రైతుల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ పాడి పథకానికి రూపకల్పన చేసింది. 8లో

గరిష్ఠం / కనిష్ఠం 40° / 26°

వాతావరణం

జిల్లాలో సోమవారం ఉదయం నుంచే ఎండ తీవ్రత మొదలై మధ్యాహ్నం అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. వడగాలులు వీస్తాయి.

ముందు జాగ్రత్తే మందు



ఉదయం ఏడు గంటలు దాటేలోగా సూర్య ప్రతాపం మొదలవుతోంది. ఆ తర్వాత గంటగంటకూ ఉష్ణోగ్రత పెరుగుతూ మధ్యాహ్నం పతాకస్థాయికి చేరుతోంది. ఉష్ణోగ్రత 40 డిగ్రీలు దాటుతుండడంతో జనం బయటకెళ్లాలంటే జంకుతున్నారు. ఈ పరిస్థితి మే నెలకల్లా మరింత తీవ్రమయ్యే అవకాశముంది. ఈ నేపథ్యాన పిల్లలు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారి ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరముంది. అంతేకాక మూగజీవాలు, మొక్కలనూ కాపాడుకోకపోతే ఎండాకాలం ముగిసేలోగా అవి దూరమయ్యే ప్రమాదం పొంచి ఉంది. ఈ మేరకు వివిధ వర్గాల ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పెంపుడు జంతువులు, ఇళ్లలో పెంచుకునే మొక్కల సంరక్షణపై నిపుణుల ఇచ్చిన సలహాలు, సూచనలతో కథనం..

– ఖమ్మం వ్యవసాయం / ఖమ్మం గాంధీ చౌక్ / ఖమ్మం వైద్యవిభాగం

ఎండ, అల్ట్రా వైలెట్ కిరణాలతో చెడు ప్రభావం



కె.రవికుమార్

ఉమ్మడి జిల్లాలో 41–44 డిగ్రీల మేర ఉష్ణోగ్రతకు తోడు అల్ట్రా వైలెట్ కిరణాలు, వడగాలులు శరీరంపై చెడు ప్రభావం చూపే అవకాశం ఉంది. వివిధ వృత్తులు చేసేవారు, రైతులు, వ్యవసాయ కూలీలు తీసుకోవాల్సి న జాగ్రత్తలను వైరా కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ కె.రవి కుమార్ వివరించారు.

- వీలైనంత వరకు వ్యవసాయ పనులను ఉదయం లేదా సాయంత్రం చేసుకోవాలి. తప్పనిసరై మధ్యాహ్నం చేయాల్సి వస్తే తలపై ఎండ పడకుండా టోపీ, గొడుగు ధరించాలి. నీరు చెమట రూపంలో బయటకు వెళ్లనున్నందున నీరు, మజ్జిగ, కొబ్బరినీళ్లు తాగాలి. రైతులు పశువులు, గొర్రెలు, మేకలను మేతకు తీసుకెళ్లినప్పుడు నీడ పట్టున చెట్ల కింద సేద తీరేలా చూడాలి.

మూగజీవాలు జాగ్రత్త



డాక్టర్ కె.వెంకటనారాయణ

అధిక ఉష్ణోగ్రతల కారణంగా పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్ల వడదెబ్బ బారిన పడకుండా తగిన యాజమాన్య పద్ధతులను పాటిస్తే ఉత్పాదక శక్తిని రక్షించినట్లవుతుందని జిల్లా పశువైద్య, పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కె.వెంకటనారాయణ తెలిపారు. ఈమేరకు ఆయన ఇచ్చిన సూచనలిలా..

- అధిక వేడి, గాలి ప్రసరణ సరిగా లేకపోవటం, షెడ్లలో కిక్కిరిసి ఉంచడం, నీటి సౌకర్యం సరిగ్గా లేక పశువులు, జీవాలు వడదెబ్బకు గురవుతాయి. తద్వారా నీరసమై జీర్ణక్రియ తగ్గి ఆకలి మందగించి ఉత్పత్తి పడిపోతుంది. అంతేకాక వ్యాధి నిరోధక శక్తి తగ్గి, చూడి పశువులకు గర్భస్రావమయ్యే ప్రమాదముంది. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకుని పిండి పదార్థాలు గంజి, జావ వంటివి పశువులకు ఆహారంగా ఇవ్వాలి. ఉదయం, సాయంత్రం పచ్చిగడ్డి, రాత్రికి ఎండుగడ్డి ఇవ్వాలి. పాడి పశువులకు దాణాను నీటితో కలిపి ఇవ్వాలి. మినరల్ మిక్చర్, ఉప్పు కలిపిన ద్రావణం ఇవ్వటం మంచిది. మేతకు ఉదయం, సాయంత్రమే తీసుకెళ్లాలి. వ్యాధులు దరిచేరకుండా గొంతువాపు, జబ్బవాపు వంటి వ్యాక్సిన్లు వేయించాలి. పశువులకు మంచి, చల్లని నీరు అందుబాటులో ఉంచాలి. వడదెబ్బకు గురైన పశువులను చల్లని గాలివచ్చే ప్రదేశంలోకి చేర్చి శరీర ఉష్ణోగ్రత తగ్గేలా పలుసార్లు నీటితో కడగాలి. తల, నుదుటిపై చల్లని గోనె సంచి కప్పాలి. ఆపై పశువైద్యులను సంప్రదించాలి.

తేమ, నీడతో మిద్దె, పెరటి తోటల రక్షణ



ఎం.వీ.మధుసూదన్

ఉష్ణోగ్రతలు పెరిగిన నేపథ్యాన మిద్దె తోటలు, పెరటి తోటల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి ఎంవీ.మధుసూదన్ సూచిస్తున్నారు. తోటల నిర్వాహకులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇలా ఉన్నాయి.

- తెల్లవారుజాము, సూర్యాస్తమయ సమయాల్లో తోటలకు నీరు పెట్టాలి. మధ్యాహ్నం నీరు పెడితే ఎక్కువగా ఆవిరవుతుంది. తోటకు మల్చింగ్ చేస్తే ఎక్కువ సేపు తేమ ఉంటుంది. ఎండుగడ్డి కూడా మల్చింగ్‌గా వాడొచ్చు. పాత షీట్లు, పాత కిటికీ తెరలను మొక్కలపై కప్పినా ఫలితం ఉంటుంది. అధిక నీరు పెడితే బ్యాక్టీరియా అభివృద్ధి చెంది, ఆక్సిజన్ కొరత ఏర్పడుతుంది. అంతేకాక వ్యాధుల బారిన పడే ప్రమాదమూ లేకపోలేదు. తోటలో క్రమం తప్పకుండా కలుపు నివారించాలి. వేడిగాలుల సమయాన ఎరువులు వేయొద్దు. ఎండతో ఒత్తిడికి గురైన మొక్కలు కోలుకునే వరకు ఎరువు వేయకూడదు.

వాహనాల నిర్వహణలో అప్రమత్తత



ఎం.రామాచారి

జీవన యానంలో వాహనాల వినియోగం కీలకంగా మారింది. ప్రస్తుత ఎండ తీవ్రత నేపథ్యాన వాహనదారులు జాగ్రత్తలు పాటించాలని మెకానిక్‌లు సూచిస్తున్నారు. ఖమ్మంకు చెందిన మెకానిక్ ఎం.రామాచారి ఇచ్చిన సూచనలు ఇలా..

- బైక్‌లు, కార్లే కాక ఎలక్ట్రికల్ వాహనాలను ఎండ సమయంలో వినియోగించినప్పుడు టైరు, ట్యూబ్‌లు చూసుకోవాలి. పెట్రోల్, డీజిల్ ఎప్పుడూ ఫుల్ ట్యాంక్ చేయించొద్దు. నిర్ణీత వ్యవధిలో ఇంజన్ ఆయిల్ మార్చాలి. ఆగకుండా ఎక్కువ దూరం ప్రయాణం చేయొద్దు. ఇంజన్ ఎప్పుడూ చల్లగా ఉండేలా ప్రయాణం కొనసాగించాలి. రేడియేటర్ కూలింగ్ తనిఖీ చేసుకోవాలి. బ్యాటరీ వాహనాలు అటు ఫుల్, ఇటు జీరో చార్జింగ్ అయ్యే వరకు చూడొద్దు. పార్కింగ్ సమయాన నీడ ప్రాంతాలనే ఎంచుకోవాలి.

ఉమ్మడి జిల్లాలో నానాటికీ పెరుగుతున్న ఎండలు

- పిల్లలు, వృద్ధుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి అవసరం
- వాహనాలు, మొక్కల సంరక్షణా కీలకమే..


ఎండతో అనారోగ్యం, తీసుకోవాల్సిన జాగ్రత్తలు



డాక్టర్ నారగాని రాంప్రసాద్



డాక్టర్ పవన్



ఎండతో ప్రజలకు ఎదురయ్యే ఇబ్బందులు, వీటిని అధిగమించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఖమ్మం జిల్లా ఆస్పత్రి జనరల్ ఫిజీషియన్ నారగాని రాంప్రసాద్, పీడియాట్రీషియన్ పవన్ వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి. అధిక వేడితో చెమట కారణంగా ఒంట్లో నీటిశాతం తగ్గి, లవణాలు బయటకు వెళ్తాయి. ఫలితంగా డీహైడ్రేషన్‌కు గురై తల నొప్పి, స్పృహ కోల్పోవడం, మాట తడబడడం, వికారం, అలసట, కళ్లుతిరగడం, రక్తపోటు సమస్యలు తలెత్తుతాయి. ఎండ ప్రభావం ఎక్కువగా వృద్ధులు, చిన్నారులు, గర్భిణులపై పడే అవకాశముంది. వీటి నివారణకు శరీరానికి కావాల్సినంత నీరు, నీటి శాతం ఎక్కువగా ఉండే పండ్లు, కొబ్బరినీరు, పెరుగు, మజ్జిగ తీసుకోవడం మంచిది. నిమ్మరసం, ఓఆర్ఎస్ ద్రావణాలు తీసుకుంటూ ఉండాలి. ఆల్కహాల్, టీ, కాఫీ, ధూమపానానికి దూరంగా ఉండాలి. వడదెబ్బతో అస్వస్థతకు గురైన వారిని చల్లటి ప్రదేశానికి తీసుకెళ్లి తల నుంచి కాళ్ల వరకు తడిగుడ్డతో తుడవాలి. గాలి ఆడేలా చూస్తూ తేరుకున్నాక ఓఆర్ఎస్ తాగించి ఆస్పత్రికి తీసుకెళ్లాలి. వీటన్నింటికి మించి ఉదయం 11 నుంచి సాయంత్రం 4లోపు తప్పనిసరైతే తప్ప బయటకు వెళ్లొద్దు. పిల్లలు ఎండలో ఆడకుండా పర్యవేక్షించాలి. తగిన నీరు తాగేలా చూడాలి. డయేరియాకు గురికాకుండా తేలికపాటి ఆహారమే ఇస్తూ నూనె పదార్థాలు, వేపుళ్లు, జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉంచాలి. పిల్లలకు అనారోగ్య సమస్యలు వస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి.

ఉపకరణాలన్నీ ఒకేసారి వాడొద్దు



కె.ద్రోణయ్య

వేసవి.. అందునా అధిక ఉష్ణోగ్రత ఉన్న నేపథ్యాన ఇళ్లలో అన్ని ఎలక్ట్రికల్ ఉపకరణాలను ఒకేసారి వినియోగించకపోవడమే మేలని ఖమ్మానికి చెందిన ఎలక్ట్రీషియన్ కె.ద్రోణయ్య చెబుతున్నారు. ఆయన సూచనల మేరకు గృహవాసులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- ఏసీలు, గీజర్ వంటి అధిక లోడ్ తీసుకునే పరికరాలను ఒకేసారి వాడితే షార్ట్ సర్క్యూట్ అయ్యే ప్రమాదం ఉంది. అవసరాలకు అనుగుణంగా.. ఓల్టేజీ ఆధారంగా ఉపకరణాలను వినియోగించాలి. ఎండ తీవ్రత ఉన్న కాలంలో వైరింగ్ సరిచూసుకోవాలి. ఇంటి వైరింగ్‌కు తప్పనిసరిగా ఎర్తింగ్ ఉండేలా చూసుకుని.. ఎర్తింగ్ ప్రాంతంలో అప్పుడప్పుడు నీరు పోయాలి.

న్యూస్‌రీల్

రామయ్యకు సువర్ణ పుష్పార్చన



నిత్యకల్యాణ తంతు నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారికి ఆదివారం అభిషేకం, సువర్ణ పుష్పార్చన నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం జరిపించారు. ఆ తర్వాత స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామి వారి ఆర్జిత సేవలు, నిత్యకల్యాణంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పెద్దమ్మతల్లికి విశేషపూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి అమ్మవారికి ఆదివారం అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. క్యూలైన్ ద్వారా భక్తులు అమ్మవారిని దర్శించుకోగా, అర్చకులు విశేషపూజలు జరిపారు. భక్తులు అన్నప్రాసనలు, ఒడిబియ్యం, పసుపు కుంకుమలు, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పూజా కార్యక్రమంలో ఈఓ ఎన్.రజనీకుమారి పాల్గొన్నారు.

నేడు గిరిజన దర్బార్

భద్రాచలం: భద్రాచలం ఐటీడీఏలో సోమవారం గిరిజన దర్బార్ నిర్వహించనున్నట్లు పీఓ బి.రాహుల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజనులు తమ సమస్యలపై దరఖాస్తులను అందజేయాలని కోరారు. అన్ని శాఖల అధికారులు సకాలంలో దర్బార్‌కు హాజరు కావాలని పేర్కొన్నారు.

ప్రభుత్వాస్పత్రుల్లో ఇన్సులిన్ కొరత



ఇల్లెందులో షుగర్ పరీక్షలు చేయించుకుంటున్న బాధితులు(ఫైల్)



ఇన్సులిన్ ఇంజెక్షన్

- సెంట్రల్ డ్రగ్ స్టోర్స్ నుంచి నిలిచిపోయిన సరఫరా
- విధిలేక ప్రైవేటు మెడికల్ షాపులకు వెళ్తున్న బాధితులు
- నెలకు ఒక్కొక్కరిపై రూ.1000 అదనపు భారం

ఇల్లెందు: షుగర్ వ్యాధిగ్రస్తులు ఉపయోగించే ఇన్సులిన్ ఇంజెక్షన్ల కొరత ఏర్పడింది. నెల రోజులుగా ప్రభుత్వాస్పత్రులకు సరఫరా నిలిచిపోయింది. దీంతో ప్రైవేటు మెడికల్ షాపుల్లో కొనుగోలు చేయాల్సి రావడంతో బాధితులపై ఆర్థికభారం పడుతోంది. ఇన్సులిన్ అవసరమైనవారికి రోజూ రెండు ఇంజెక్షన్లు ఇవ్వాల్సి ఉంటుంది. ఇల్లెందు ఏరియా ఆస్పత్రిలోనే వెయ్యి మంది వరకు ఇన్సులిన్ పొందేవారు ఉన్నారని, జిల్లా వ్యాప్తంగా కనీసం 10 వేల మంది వరకు ఉంటారని వైద్యాధికారులు చెబుతున్నారు. వారానికో ఇంజెక్షన్ల బాక్స్ అవసరమవుతుందని, ఒక్కో దాని ఖరీదు రూ. 250 వరకు ఉండగా, నెలకు రూ. 1000 వరకు ఖర్చు చేయాల్సి వస్తుందని బాధితులు వాపోతున్నారు. జిల్లాలో 29 పీహెచ్‌సీలు, 10 యూపీహెచ్‌సీలు, 376 సబ్ సెంటర్లు, కొత్తగూడెం, పాల్వంచ, మణుగూరు, భద్రాచలం, చర్ల, అశ్వారావుపేట, ఇల్లెందు ప్రాంతాల్లో ఏరియా ఆస్పత్రులు ఉన్నాయి. వీటిలో మణుగూరు, అశ్వారావుపేటలో పాత స్టాక్ కొంత ఉండగా మిగతా అన్ని చోట్ల కొరత ఏర్పడింది. ప్రభుత్వ దవాఖానాకు వచ్చే 10 మందిలో 8 మంది రోగులు షుగర్ పరీక్షలు చేయించుకుంటున్నారు. షుగర్ ఎక్కువ ఉందని రిపోర్టు రాగానే డాక్టర్ సంప్రదించటం, అక్కడి నుంచి మందులు ఇచ్చే గదికి పరుగులు తీయటం, అక్కడి ఫార్మాసిస్ట్ ఇన్సులిన్ లేదనటంతో భయంతో మెడికల్ షాపుల వద్దకు వెళ్లి కొనుగోలు చేయడం పరిపాటిగా మారింది. జిల్లా వ్యాప్తంగా ఏరియా ఆస్పత్రులు, పీహెచ్‌సీలకు సెంట్రల్ డ్రగ్స్ స్టోర్స్ నుంచి ఇన్సులిన్ ఇంజెక్షన్ల సరఫరా నిలిచిపోయింది. ఏరియా ఆస్పత్రుల నుంచి ఇండెంట్ పంపించగా, మందు లేదని సమాచారం వస్తుందని వైద్యాధికారులు పేర్కొంటున్నారు. అయితే బాధితులు మాత్రం ఫార్మసీ సిబ్బందితో ఇంజెక్షన్ కావాలని ఘర్షణకు దిగుతున్నారు. ఈ విషయమై ఇల్లెందు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హర్షవర్ధన్‌ను వివరణ కోరగా.. ఇన్సులిన్ ఇంజెక్షన్ల కొరత వాస్తవమేనని తెలిపారు.

గ్రామాల్లోనే భూ రికార్డులు



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి. పాటిల్

కలెక్టర్ జితేష్ వి.పాటిల్

సూపర్‌బజార్(కొత్తగూడెం): భూ భారతి చట్టం ద్వారా భూ సమస్యల పరిష్కారం అనంతరం పూర్తిస్థాయి వివరాలతో కూడిన రికార్డులను ఆయా గ్రామాల్లో అందుబాటులో ఉంచుతామని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. కొత్తగూడెం క్లబ్‌లో ఆదివారం కొత్తగూడెం, చుంచుపల్లి మండలాలస్థాయిలో భూభారతి చట్టంపై నిర్వహించిన అవగాహనా సదస్సులో మాట్లాడారు. రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఈ చట్టాన్ని తీసుకువచ్చిందని తెలిపారు. వివాదాలకు అవకాశం లేకుండా రైతులకు సాగు భూములపై యాజమాన్య హక్కు కల్పించేలా నూతన చట్టం ఉందన్నారు. ధరణి చట్టంలో ఎవరైనా తమ రికార్డులను కనిపించకుండా చేసుకునే అవకాశం ఉండేదని, కానీ భూభారతిలో హక్కుల పూర్తి రికార్డు పారదర్శకంగా, అందరికీ అందుబాటులో ఉంటుందని కలెక్టర్ వివరించారు. భూ హక్కుల రికార్డు సర్టిఫైడ్ కాపీ కావాలంటే భూభారతిలో ఉన్న ఫారంలో పది రూపాయల ఫీజు చెల్లించి దరఖాస్తు చేసే తహసీల్దార్ కాపీ జారీ చేస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఆర్డీఓ మధు, కొత్తగూడెం, చుంచుపల్లి తహసీల్దార్లు పుల్లయ్య, కృష్ణ, కొత్తగూడెం సొసైటీ అధ్యక్షుడు మండే వీరహనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ శాఖలో పదోన్నతులు

డీడీలకు జేడీలుగా, ఏడీలకు డీడీలుగా అవకాశం

ఖమ్మంవ్యవసాయం: వ్యవసాయ శాఖలో పదోన్నతుల ప్రక్రియ శనివారం మొదలైంది. రాష్ట్రంలోని 5, 6వ జోన్లలో పనిచేస్తున్న ఆరుగురు డిప్యూటీ డైరెక్టర్లకు జాయింట్ డైరెక్టర్లుగా పదోన్నతి కల్పించి పోస్టింగ్ ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా ఖమ్మం రైతు శిక్షణా కేంద్రంలో డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న అభిమన్యుడును జిల్లాలోనే ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్‌గా నియమించినట్లు సమాచారం. అలాగే, హైదరాబాద్‌లో డిప్యూటీ డైరెక్టర్‌గా ఉన్న సింగారెడ్డిని ఖమ్మం జేడీగా నియమించినట్లు తెలిసింది. ఆయన త్వరలోనే ఉద్యోగ విరమణ చేయనున్నందున హైదరాబాద్‌లోనే కొనసాగించే అవకాశమున్నట్లు సమాచారం. ఇక మహబూబాబాద్ డీఏఓగా పనిచేస్తున్న డిప్యూటీ డైరెక్టర్ ఎం.విజయనిర్మలకు జేడీగా పదోన్నతి కల్పించి వరంగల్ ఆత్మ ప్రాజెక్టుగా డైరెక్టర్‌గా నియమించినా మహబూబాబాద్‌లోనే కొనసాగించనున్నట్లు తెలిసింది. కాగా, అసిస్టెంట్ డైరెక్టర్లకు డిప్యూటీ డైరెక్టర్లుగా పదోన్నతి కల్పించే ప్రక్రియ సోమవారం చేపట్టనుండగా, ఉమ్మడి జిల్లాలో ముగ్గురికి అవకాశం లభించనుంది.

రజతోత్సవాలకు తరలిన బీఆర్ఎస్ శ్రేణులు



నృత్యం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కాంతారావు, నాయకులు

మణుగూరు రూరల్ : హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఆదివారం నిర్వహించిన బీఆర్ఎస్ రజతోత్సవ సభకు పార్టీ కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివెళ్లారు. తొలుత పట్టణంలోని తెలంగాణ భవన్ వద్ద ఏర్పాటు చేసిన గులాబీ జెండాను పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు ఎగురవేశారు. అనంతరం కార్లను, ప్రత్యేక వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. మార్గమధ్యలో మాజీ ఎమ్మెల్యే, నాయకులు నృత్యాలు చేస్తూ కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపారు. మండల వ్యాప్తంగా వాడవాడనా పార్టీ నాయకులు గులాబీ జెండాలను ఎగురవేసి సభకు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ కుర్రి నాగేశ్వరరావు, పట్టణ కన్వీనర్ కుంటా లక్ష్మణ్, నాయకులు పోశం నర్సింహరావు, నాగెల్లి వెంకటేశ్వర్లు, నూకారపు రమేష్, ఎడ్ల శ్రీనివాస్, వట్టం రాంబాబు, తాళ్లపల్లి యాదగిరిగౌడ్, ముద్దంగుల కృష్ణ, ఎడవల్లి వెంకటయ్య, ముత్యంబాబు పాల్గొన్నారు.

పోలీసులకు ప్రశంసా పత్రాలు



ప్రశంసా పత్రం అందుకుంటున్న ఎస్సై ప్రవీణ్

కొత్తగూడెంటౌన్: జిల్లాలో గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతూ, గంజాయి రవాణాను అడ్డుకుంటున్న పోలీసులకు శనివారం రాష్ట్ర డీజీపీ డాక్టర్ జితేందర్ ప్రశంసా పత్రాలు, రివార్డులు అందజేసి అభినందించారు. గతంలో సీసీఎస్ సీఐగా పని చేసిన బెల్లం సత్యనారాయణ, టాస్క్‌ఫోర్స్ ఎస్సైలు జలకం ప్రవీణ్, సుమన్, సిబ్బంది రవి, విజయ్, భాస్కర్, సాయిరెడ్డి డీజీపీ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందుకున్నారు.

కిన్నెరసానిలో పర్యాటక సందడి



జలాశయంలో బోటు షికారు చేస్తున్న పర్యాటకులు

పాల్వంచరూరల్: కిన్నెరసానిలో ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చారు. డ్యామ్ పైనుంచి జలాశయాన్ని, డీర్ పార్కులోని దుప్పులను వీక్షించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందోత్సాహాల నడుమ గడిపారు. 360 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించగా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.19,660 ఆదాయం లభించగా, 120మంది బోటు షికారు చేయగా టూరిజం కార్పొరేషన్ సంస్థకు రూ.6,270 ఆదాయం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.

నేడు ప్రజావాణి రద్దు

సూపర్‌బజార్(కొత్తగూడెం): భూ భారతి చట్టం అమలులో భాగంగా జిల్లావ్యాప్తంగా అవగాహనా సదస్సులు నిర్వహించడంలో జిల్లా అధికార యంత్రాంగం నిమగ్నమై ఉన్నందున సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈవిషయాన్ని గమనించి దరఖాస్తులు అందజేయడానికి కలెక్టరేట్‌కు రావొద్దని సూచించారు.

క్లుప్తంగా

నిత్యాన్నదాన సత్రం వరకు తివాచీ



సత్రం వరకు ఏర్పాటు చేసిన తివాచి

భద్రాచలం: శ్రీసీతారామ చంద్రస్వామి దేవస్థానం అధికారులు భక్తుల కోసం ఆలయం నుంచి సత్రం వరకు తివాచీ ఏర్పాటు చేశారు. వేసవి కాలంలో భక్తులు అన్నదాన సత్రానికి నడిచిరావాలంటే తీవ్ర ఇబ్బందులు పడతున్నారు. దీంతో ఆలయం నుంచి సత్రం వరకు రోడ్డు మీద తివాచీ (మ్యాట్)ని పరచగా.. భక్తులు కృతజ్ఞతలు తెలిపారు.

సెలవులకు ఊరెళ్తే సమాచారం ఇవ్వండి..

ఎస్పీ రోహిత్‌రాజు

కొత్తగూడెంటౌన్: వేసవి సెలవులకు ఊర్లో వారు పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్పీ రోహిత్‌రాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎవరూ లేని ఇంట్లో దొంగతనాలకు పాల్పడేందుకు దుండగులు యత్నిస్తారని, చోరీలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. రాత్రి వేళల్లో వీధుల్లో గస్తీని ముమ్మరం చేశామని, ఊరికి వెళ్తే దగ్గరలోని పోలీస్ స్టేషన్‌లో చిరునామా, ఫోన్ నంబర్ ఇవ్వాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే తక్షణమే డయల్ 100కు ఫోన్ చేయాలని కోరారు.

వెదురు ఉత్పత్తులు అద్భుతం



చంద్రుగొండ: వెదురు ఉత్పత్తులను పరిశీలిస్తున్న సుస్మిత

భద్రాచలం/చంద్రుగొండ/ములకలపల్లి: వెదురు ఉత్పత్తులతోపాటు ఆదివాసీల సంస్కృతి సంప్రదాయాలు తెలిసేలా భద్రాచలంలో ఏర్పాటు చేసిన మ్యూజియం అద్భుతంగా ఉన్నాయని గుల్లాకారి ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు సుస్మిత కనేరి అన్నారు. ఆదివారం ఆమె భద్రాచలంలోని ఐటీడీఏ ప్రాంగణంలో ఉన్న ట్రైబల్ మ్యూజియం, చంద్రుగొండ మండలంలోని బెండాలపాడు శివారులోని బ్యాంబో క్లస్టర్‌తోపాటు ములకలపల్లి మండలంలోని మాధారం గ్రామంలో ఏర్పాటు చేసిన ఆర్ట్స్, క్రాఫ్ట్స్ యూనిట్‌ను సందర్శించి మాట్లాడారు. గిరిజన సంప్రదాయ హస్తకళల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ చేపట్టనున్నట్లు తెలిపారు. వెదురు ఉత్పత్తుల తయారీలో గిరిజన సంస్కృతి ఉట్టిపడుతోందని, మార్కెటింగ్‌పై కలెక్టర్‌తో చర్చించనున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో వెంకయ్య, వీరస్వామి, హరికృష్ణ, అంజన్, ఈసం నాగభూషణం, మల్లం కృష్ణయ్య, బొర్రా సురేశ్, వి.గోవర్ధన్ పాల్గొన్నారు.

లాక్రోస్ జాతీయస్థాయి టోర్నమెంట్‌కు కార్తీకరెడ్డి



కార్తీకరెడ్డి

తల్లాడ: ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రాలో ఈ నెల 28 నుంచి మే 1వ తేదీ వరకు నిర్వహించనున్న లాక్రోస్ 3వ జూనియర్, సీనియర్ జాతీయస్థాయి టోర్నీలో పాల్గొనేందుకు తల్లాడకు చెందిన డి.కార్తీకరెడ్డి ఎంపికైంది. తల్లాడకు చెందిన దగ్గుల రామకృష్ణారెడ్డి, విజయలక్ష్మి దంపతుల కుమార్తె కార్తీకరెడ్డి హైదరాబాద్‌లోని గురుకుల పాఠశాలలో 9 వతరగతి చదువుతోంది. క్రీడల్లో కూడా రాణిస్తూ జాతీయ పోటీలకు ఎంపికైంది. తెలంగాణ జట్టు తరఫున కార్తీకరెడ్డి ఆదివారం బయలుదేరి ఆగ్రా వెళ్లింది.

కాంటాల జాప్యంపై రైతుల ఆగ్రహం

నేలకొండపల్లి: మండలంలోని రాజారాంపేట ప్రాథమిక సహకార సంఘం పరిధిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఇష్టారాజ్యంగా కాంటాలు వేస్తున్నారని రైతులు మండిపడ్డారు. కాంటాల్లో జాప్యం చేస్తున్నారని రైతులు ఆదివారం కేంద్రం వద్ద ఆందోళన చేపట్టారు. నెల రోజులుగా కేంద్రంలో ధాన్యం ఆరబెట్టినప్పటికీ కాంటాలు వేయటం లేదని.. కొందరికి మాత్రం అప్పటికప్పుడే వచ్చిన ధాన్యానికి కూడా కాంటాలు వేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. లారీలను వెళ్లకుండా అడ్డుకున్నారు. ఈ విషయంపై రాజారాంపేట సొసైటీ సీఈఓను వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులో లేరు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.21,000

'ఏకలవ్య' సిద్ధం!

మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల భవన నిర్మాణం పూర్తి

- ములకలపల్లిలో కొనసాగుతున్న విద్యుత్, పైపులైన్ పనులు
- నాలుగేళ్లుగా జాప్యం జరిగినా ఇటీవల పనుల్లో వేగం



మూకమామిడి ప్రాజెక్ట్ శివారులో నిర్మించిన ఏకలవ్య పాఠశాల భవన సముదాయం

ములకలపల్లి: మూకమామిడి ప్రాజెక్ట్ సమీపంలో నిర్మించిన ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ (ఈఎంఆర్‌ఎస్) భవన సముదాయాలు ఈ ఏడాది అందుబాటులోకి రానున్నాయి. 13 ఎకరాల విస్తీర్ణంలో రూ.35 కోట్ల వ్యయంతో చేపట్టిన పనులు, తుదిదశకు చేరాయి. పాఠశాల నిర్మాణానికి మినిస్ట్రీస్ ఆఫ్ ట్రైబల్ ఎఫైర్స్ (ఎంటీఏ) నుంచి రెండు దఫాలుగా రూ.35 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో పాఠశాల భవనాల సముదాయం, బాల బాలికలకు వేర్వేరుగా రెండేసి హాస్టల్ బ్లాక్‌లు, బాల, బాలికల వార్డెన్ల రెసిడెన్స్, స్టాఫ్ క్వార్టర్లు, కిచెన్, డైనింగ్, అంతర్గత సీసీ రోడ్లు, చుట్టూ ప్రహరీ నిర్మించారు. నాలుగేళ్ల కిందట నిర్మాణాలు ఆరంభించగా, పనుల్లో తీవ్ర జాప్యం జరిగింది. ఇటీవల పనులు పూర్తికావడంతో భవనాలు అందుబాటులోకి రానున్నాయి. ఇప్పటికే భవనాల నిర్మాణాలు, సీసీ పనులు పూర్తికాగా, విద్యుత్, పైపులైన్ కనెక్షన్ పనులు తుదిదశలో ఉన్నాయి. ఇటీవలే జగన్నాథపురం సబ్‌స్టేషన్ నుంచి పాఠశాలకు నూతనంగా విద్యుత్‌లైన్ నిర్మించారు. మూడేళ్లపాటు నత్తనడకన సాగిన నిర్మాణాలపై ఎమ్మెల్యే జారె ఆదినారాయణ దృష్టి సారించారు. సంబంధిత ఉన్నతాధికారులు, కాంట్రాక్ట్ ఏజెన్సీలతో ఎమ్మెల్యే స్వయంగా మాట్లాడి, పనుల్లో వేగం పెంచారు.

ఈఏడాదితో పూర్తిస్థాయి 'అప్‌గ్రేడ్'

మండలంలో నాలుగేళ్ల క్రితం ఏకలవ్య పాఠశాల మంజూరైంది. తాత్కాలిక ప్రభుత్వ భవనాలు లేకపోవడంతో దమ్మపేట మండలంలోని అకంపాలెంలోని ఐటీడీఏ పరిధి భవనాల్లో పాఠశాలను నిర్వహిస్తున్నారు. స్టేట్ సిలబస్‌కు సంబంధించి సహజంగా జూన్ 12న విద్యాసంవత్సరం ప్రారంభమవుతుంది. కానీ, ఏకలవ్యలో కాస్త ముందుగానే విద్యా సంవత్సరం ప్రారంభిస్తారు. కో–ఎడ్యుకేషన్ పద్ధతిలో, సీబీఎస్‌ఈ సిలబస్‌లో



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జారె ఆదినారాయణ (ఫైల్)

బోధించే ఈ పాఠశాలలో మార్చి 31లోగా పరీక్షలు పూర్తిచేసి, ఏప్రిల్ 1 నుంచి పైతరగతులకు ప్రమోట్ చేస్తారు. ఏప్రిల్‌లో తరగతులు బోధించి, మే 1 నుంచి జూన్ 30 వరకు వేసవి సెలవులిస్తారు. జూలై 1 నుంచి యథావిధిగా తరగతులు చెబుతారు. 6 నుంచి 12వ తరగతి వరకూ ఉండే ఈఎంఆర్‌ఎస్‌లో ములకలపల్లిలో తొలుత 6, 7 క్లాసులను ఆరంభించారు. ఏటా తరగతులను అప్‌గ్రేడ్ చేస్తున్నారు. ఈ ఏడాది (202526)లో 12వ తరగతిలోకి బ్యాచ్ ప్రవేశించింది. దీంతో పాఠశాల పూర్తిస్థాయిలో అప్‌గ్రేడ్ అయింది.

నెలాఖరులోగా అప్పగిస్తాం

ములకలపల్లి ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ భవన సముదాయం పనులన్నీ దాదాపు పూర్తయ్యాయి. పైపులైన్, విద్యుత్ కనెక్షన్ పనులు కూడా చేస్తున్నాం. ఈ నెలాఖరులోగా భవన సముదాయాలను విద్యాశాఖ అధికారులకు అప్పగిస్తాం.

–నాగేశ్వరరావు, సెంట్రల్ పీడబ్ల్యూడీ ఏఈ

త్వరితగతిన పూర్తి చేయాలి



కోట్లాది రూపాయలు వెచ్చించి ఏకలవ్య పాఠశాల భవనాల నిర్మాణాలు ప్రారంభించారు. కానీ అధికారుల నిర్లక్ష్యంతో పనులు సకాలంలో పూర్తికావడంలేదు. ఈ విద్యా సంవత్సరంలోనైనా విద్యార్థులకు అందుబాటులోకి తేవాలి.

–నూపా భాస్కర్, స్థానికుడు

మే 15లోగా ప్రారంభిస్తాం



నూతన భవనాలను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నాం. పూర్తిస్థాయిలో పనులు చేసేలా నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. జిల్లా మంత్రుల చేతుల మీదుగా మే 15లోగా ప్రారంభిస్తాం.

–జారె ఆదినారాయణ, అశ్వారావుపేట ఎమ్మెల్యే

మేమిక ఉండలేం..

- బదిలీల కోసం ఎక్సైజ్ ఉద్యోగుల ఎదురుచూపులు
- ఆరేళ్లుగా 180 మందికి స్థానచలనం లేదు..
- దూర ప్రాంతాల ఉద్యోగుల్లో ఆవేదన



ఖమ్మంక్రైం: ఉమ్మడి జిల్లాలో గతంలో ఎన్నడూ లేని విధంగా ఎక్సైజ్ శాఖలో ఆరేళ్లుగా బదిలీలు జరగకపోవటంతో సిబ్బంది ఎప్పుడెప్పుడా అని ఆశతో ఎదురుచూస్తున్నారు. ఈ నెలలో అయిపోతుంది, వచ్చే నెలలో అయిపోతుంది అంటూ కాలం వెళ్లదీస్తున్నారు తప్ప బదిలీల గురించి పట్టించుకోనే పరిస్థితి లేదు.

సీఐ మొదలు కానిస్టేబుళ్లు

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఖమ్మం ఎక్సైజ్ స్టేషన్–1, ఖమ్మం ఎక్సైజ్‌స్టేషన్–2, నేలకొండపల్లి, వైరా, మధిర, సత్తుపల్లి, సింగరేణి మొత్తం 7 ఎక్సైజ్ స్టేషన్‌లు ఉండగా, భద్రాద్రి కొత్తగూడెంలో కొత్తగూడెం, అశ్వారావుపేట, పాల్వంచ, మణుగూరు, భద్రాచలం, ఇల్లెందు కలిపి 6 స్టేషన్‌లు ఉన్నాయి. దీనికి తోడు రెండు డీటీఎఫ్ (డిస్ట్రిక్ టాస్క్‌ఫోర్స్)లు, ఒక ఎన్‌ఫోర్స్‌మెంట్ స్టేషన్‌లు ఉన్నాయి. వీటిలో పని చేస్తున్న 180 మంది సిబ్బంది ఆరేళ్లుగా బదిలీల కోసం ఎదురుచూస్తున్నారు. వీరిలో ఒక సీఐ, ఇద్దరు ఎస్‌ఐలు ఉండగా 37 మంది హెడ్‌కానిస్టేబుళ్లు 140 మంది కానిస్టేబుళ్లు ఉన్నారు. ఖమ్మం ఎక్సైజ్‌స్టేషన్–2 ఒకప్పుడు బూర్గంపాడు ఎక్సైజ్ స్టేషన్ కాగా ముంపు మండలాలు అప్పట్లో ఆంధ్రప్రదేశ్‌లో కలపటంతో ఆ స్టేషన్‌ను అక్కడి నుంచి ఖమ్మం తరలించి ఎక్సైజ్‌స్టేషన్–2గా మార్చారు. అయితే దాదాపు పదేళ్లు కావొస్తున్నా ఈ స్టేషన్‌లో 8 మందికి పైగా సిబ్బంది అప్పటి నుంచి ఇక్కడే పని చేస్తుండటం గమనార్హం. ఏళ్ల తరబడి అవే స్టేషన్లలో పనిచేస్తుండటంతో సిబ్బందిపై సైతం పలు ఆరోపణలు వస్తున్నాయి. దీనికితోడు ఎంతోకాలంగా ఏజెన్సీ ప్రాంతాలు, దూరప్రాంతాల్లో పనిచేస్తున్న సిబ్బంది సైతం ఈ స్టేషన్లలో ఎంతకాలం పనిచేయాలనే ధోరణితో నిరాశ చెందుతున్నారు.

త్వరలోనే ప్రక్రియ..?

గతంలో మాదిరిగా ఈసారి బదిలీల ప్రక్రియకు బ్రేక్ పడే అవకాశం లేదని దాదాపు బదిలీలు జరగటం ఖాయమని కొందరు ఎక్సైజ్ అధికారులు చెబుతున్నారు. ఏప్రిల్ చివరి వారం లేదా, మే మొదటివారంలో బదిలీలు జరిగే అవకాశం ఉందని ఎక్సైజ్ రాష్ట్ర ఉన్నతాధికారి విదేశాల్లో ఉండటంతో ఆయన తిరిగి రాగానే వెంటనే రాష్ట్రవ్యాప్తంగా బదిలీల ప్రక్రియ ఉంటుందని చెబుతున్నారు, వచ్చే నెల వరకు బదిలీ ప్రక్రియ జరిగితే తమ పిల్లల విద్యాభ్యాసానికి ఇబ్బంది ఉండదని ఆలస్యం అయితే ఇబ్బందులు పడాల్సి వస్తుందని సిబ్బంది చెబుతున్నారు.

లౌకిక తత్వంపై మాట్లాడితే సస్పెన్షనా?



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జాతీయ ఉపాధ్యక్షుడు నితీష్ నారాయణ్

ఖమ్మంమయూరిసెంటర్ : ఎస్ఎఫ్ఐ ఓ విశ్వవిద్యాలయం వంటిదని సమాఖ్య జాతీయ ఉపాధ్యక్షులు నితీష్ నారాయణ్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం హిందూత్వ ఎజెండాతో ముందుకు సాగుతోందని, లౌకికతత్వంపై మాట్లాడితే రీసెర్చ్ స్కాలర్ రాందాస్‌పై రెండేళ్ల పాటు యూనివర్సిటీ నుంచి బహిష్కరించిందని ఆరోపించారు. ఖమ్మం భక్త రామదాసు కళాక్షేత్రంలో మూడు రోజుల పాటు సాగిన ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా నితీష్ నారాయణ్ మాట్లాడుతూ.. ధనిక, ఫ్యూడల్ భావజాలానికి వ్యతిరేకంగా శ్రమజీవుల పక్షాన తమ సంఘం నిలబడుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తూ హెచ్‌సీయూ భూములను కాజేస్తోందన్నారు. ఎస్ఎఫ్ఐ దేశానికి ఎంతోమంది నిష్ణాతులను ఇచ్చిందని, జై భీమ్ చిత్ర ఇతివృత్తానికి సంబంధించిన జస్టిస్ చంద్రు ఎస్ఎఫ్ఐకి చెందిన వారే కావడం గర్వకారణమని అన్నారు. త్యాగధనులు పుట్టిన గడ్డ ఖమ్మంలో మహాసభలు జరగడం హర్షణీయమని అన్నారు. కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి స్కైలాబ్‌బాబు మాట్లాడుతూ విద్యారంగాన్ని కాషాయీకరణ చేసే కుట్రలో భాగంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యా విధానానికి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. విద్యారంగంలో జ్యోతిష్యం, మూఢ విశ్వాసాలను చొప్పించి పాఠ్య పుస్తకాలను మార్చేందుకు మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కోయ చంద్రమోహన్, ఐద్వా రాష్ట్ర కోశాధికారి మాచర్ల భారతి తదితరులు పాల్గొన్నారు.

ఆమె విజయం.. స్ఫూర్తిదాయకం..

- వ్యాధి భయపెట్టినా.. లక్ష్యాన్ని చేరిన యువతి..
- గ్రూప్–1తో పాటు 5 ఉద్యోగాల విజేత జ్యోతి శిరీష



జ్యోతిశిరీషను సన్మానిస్తున్న కూరపాటి ప్రదీప్‌కుమార్

ఖమ్మంవైద్యవిభాగం: యాభైసార్లు రక్తం ఎక్కించుకుని, ఒకవైపు తన వ్యాధిని నయం చేసుకుంటూనే మరోవైపు సర్కారు కొలువు కొట్టాలనే సంకల్పంతో పోరాడి.. తన లక్ష్యాన్ని చేరుకున్న జ్యోతి శిరీష ఆదర్శప్రాయురాలని ప్రముఖ చిన్నపిల్లల వైద్యులు కూరపాటి ప్రదీప్‌కుమార్ పేర్కొన్నారు. రేయింబవళ్లు పుస్తకాలతో కుస్తీ పట్టి గ్రూప్–1లో ర్యాంకు సాధించి ఏకంగా 5 సర్కారు కొలువులను కొట్టిన యువతి.. ఖమ్మం జిల్లాకే గర్వకారణమని కొనియాడారు. నిరుపేద కుటుంబంలో జన్మించి, బాల్యం నుంచే సికిల్‌సెల్ రక్తహీనతతో కూడిన వ్యాధితో బాధపడుతున్న ఆమె.. ఐదు ఉద్యోగాలు సాధించిన తీరు అద్భుతమన్నారు. ఆమె పూర్తి వైద్య ఖర్చులతో పాటు మందులను కూడా ఉచితంగా అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఆదివారం అయన వైద్యశాలలో జ్యోతి శిరీషను సన్మానించారు. ఈ సందర్భంగా జ్యోతిశిరీష మాట్లాడుతూ.. అత్యంత ప్రమాదకరమైన సికిల్‌సెల్ వ్యాధితో తాను బాధపడుతూ అనేక సందర్భాల్లో తాను సమాజాన్ని చూస్తానో లేదో అని భయపడినప్పటికీ.. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే అకుంఠిత దీక్షతో తాను గ్రూప్–1లో ర్యాంకును సాధించానని తెలిపారు. తనది జిల్లాలోని మిట్టపల్లి గ్రామమని, తండ్రి సుతారీ మేస్త్రీ, అమ్మ వ్యవసాయ కూలీ అని తెలిపారు. తాను సికిల్ సెల్ ఎనీమియా (తీవ్ర రక్తహీనత) బాధితురాలినని, ఆరో తరగతిలో తనకీ సమస్య ఉందని వైద్యులు నిర్ధారించారని, తరచూ రక్తం తగ్గిపోయి కాళ్లు, చేతులు వాపు వచ్చేవని, దానికితోడు తలనొప్పి, ఎముకల మధ్య సూదులతో గుచ్చినట్టు బాధ ఉండేదని, అన్నీ భరించి, ఉద్యోగాలు సాధించానని, తల్లిదండ్రులు ఎంతో ప్రోత్సహించారని తెలిపారు.

పోక్సో కేసు నమోదు

కొత్తగూడెంఅర్బన్: బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై ఆదివారం లక్ష్మీదేవిపల్లి పోలీస్ స్టేషన్‌లో పోక్సో కేసు నమోదైంది. ఎస్ఐ రమణారెడ్డి కథనం ప్రకారం.. మండలంలోని ఓ జీపీకి చెందిన ఓ మహిళ తన భర్త చనిపోవడంతో మరో వ్యక్తిని పెళ్లి చేసుకుంది. మొదటి భర్త సంతానమైన 13 ఏళ్ల బాలిక హాస్టల్‌లో చదువుతోంది. వేసవి సెలవులు కావడంతో ఇంటికి వచ్చింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో తండ్రి సమానుడైన, మహిళ రెండో భర్త బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఇంటికి వచ్చిన తల్లికి బాలిక విషయం చెప్పడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నమని ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో సామగ్రి దగ్ధం



పూర్తిగా దగ్ధమైన సామగ్రి

ఇల్లెందురూరల్: మండలంలోని తిలక్ నగర్ జీపీ కల్తీ రామయ్య గుంపు గ్రామంలో ఆజ్మీర కిశోర్ ఇంట్లో ఆదివారం విద్యుదాఘాతంతో సామగ్రి దగ్ధమైంది. కిషోర్‌తోపాటు కుటుంబ సభ్యులు తెల్లవారుజామున నిద్ర లేచి ఆరుబయట పనులు చేసుకుంటుండగా ఇంట్లో నుంచి ఒక్కసారిగా మంటలు రావడాన్ని గమనించి ఆర్పేందుకు ప్రయత్నించారు. విద్యుత్ తీగల నుంచి మంటలు వ్యాపిస్తుండటంతో కంగారుపడి ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. వారు వచ్చి మంటలను అదుపులోకి తెచ్చినప్పటికీ సామగ్రి పూర్తిగా దగ్ధమైంది. సుమారు రూ.5 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని స్థానికులు తెలిపారు.

ఆరు మందుపాతరల నిర్వీర్యం



పోలీస్ బలగాలు గుర్తించిన మందుపాతరలు

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని దాంతరి జిల్లాలో మావోయిస్టులు ఏర్పాటు చేసిన ఆరు మందుపాతరలను ఆదివారం బలగాలు గుర్తించి నిర్వీర్యం చేశాయి. దాంతరి జిల్లా ఎస్పీ సూరజ్ సింగ్ కథనం ప్రకారం.. జిల్లాలోని బల్లారి సమీపంలో గల సాల్హీబాట్ అటవీ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహిస్తున్న డీఆర్‌జీ బలగాలు మూడు రైస్ కుక్కర్ బాంబులు, రెండు పైపు బాంబులు, ఒక టిఫిన్‌బాంబును గుర్తించాయి. వాటిని అక్కడే నిర్వీర్యం చేశాయి. వీటితో పాటు ఒక వాకీటాకీ కూడా లభ్యమైందని ఎస్పీ వెల్లడించారు.

పాడి వృద్ధి.. పాలు సమృద్ధి..

- సహకార సంఘాల సభ్యులకు డీసీసీబీ ద్వారా రుణాలు
- పాడి యూనిట్లలో 70 శాతం మేర లోన్
- ఆపై సొసైటీల ద్వారా పాల సేకరణకు ప్రణాళిక



జిల్లా కేంద్ర సహకార బ్యాంకు

ఖమ్మంవ్యవసాయం: చిన్న, సన్నకారు రైతుల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ) పాడి పథకానికి రూపకల్పన చేసింది. పాలు, పాల ఉత్పత్తులకు ఉన్న డిమాండ్ దృష్ట్యా ఈ ప్రాజెక్టును రూపొందించగా.. రైతుల సంక్షేమం, శ్రేయస్సు కోసం కొనసాగుతున్న సహకార సంఘాల్లో సభ్యులకు లబ్ధి జరగనుందని భావిస్తున్నారు. ఇప్పటికే వ్యవసాయ రంగ అభివృద్ధి కార్యకలాపాలు నిర్వహిస్తున్న క్రమాన అనుబంధంగా పాడి పరిశ్రమకూ ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించారు. రూ.3,460.70 కోట్ల లావాదేవీలతో రాష్ట్రంలోనే రెండో స్థానంలో కొనసాగుతున్న ఖమ్మం డీసీసీబీ ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలే కాక మహబూబాబాద్, ములుగు జిల్లాల్లోని బయ్యారం, గార్ల, వాజేడు, వెంకటాపురం మండలాలకు విస్తరించి ఉంది. మొత్తంగా 100 సహకార సంఘాలతో 1.70 లక్షల మంది సభ్యులతో కూడిన ఈ బ్యాంకు 50 బ్రాంచ్‌లతో లావాదేవీలు కొనసాగిస్తోంది. ఈ ఏడాది రూ.9.64 కోట్ల లాభాలతో ఉన్న నేపథ్యాన పాడి పరిశ్రమపై ఆసక్తి ఉన్న వారికి చేయూతనివ్వాలని కొత్త పథకాన్ని రూపొందించింది. తద్వారా ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి పాలు దిగుమతి అవసరం లేకుండా స్థానికంగా పాల ఉత్పత్తి పెరుగుతుందని భావిస్తున్నారు.

30 శాతం నిధులు చాలు..

పాడి యూనిట్ల స్థాపనకు ముందుకొచ్చే రైతులకు డీసీసీబీ రుణాలు ఇవ్వనుంది. ఆసక్తి కలిగిన వారు 30 శాతం నిధులతో ముందుకొస్తే మిగతా 70 శాతం నిధులను బ్యాంకు వాటాగా సమకూరుస్తుంది. ఉదాహరణకు రూ.లక్ష విలువైన గేదెకు రైతు రూ.30 వేలు తన వాటాతో సిద్ధమైతే మిగతా రూ.70 వేలు రుణంగా అందుతుంది. గరిష్టంగా రెండు గేదెల వరకు అవకాశం కల్పిస్తారు.

సొసైటీ సభ్యులకే అవకాశం

ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘా(పీఏసీఎస్)ల్లో సభ్యులైన వారికి మాత్రమే ఈ పథకంలో చోటు కల్పిస్తారు. వ్యవసాయ భూమి, సాగునీటి వనరులు ఉండి, పంటలు సాగు చేసే వారికి పాడి పరిశ్రమలో ప్రాధాన్యత ఇస్తే బహుముఖ లాభాలు ఉంటాయని భావిస్తున్నారు. తద్వారా సహకార సంఘాల ఉద్దేశం కూడా నెరవేరి చిన్న, సన్నకారు రైతులు ఆర్థికంగా బలోపేతమయ్యే అవకాశముంటుందని చెబుతున్నారు.

నీటి వనరులు ఉన్న ప్రాంతాలకు ప్రాధాన్యత

డీసీసీబీ పరిధిలో నీటి వనరులు ఉన్న ప్రాంతాల్లో పాడి పరిశ్రమ పథకాన్ని అమలు చేసేందుకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు. సాగర్ ఆయకట్టు ప్రాంతంతో పాటు ఇతర జలవనరులు ఉన్న ప్రాంతాల్లో సహకార సంఘాల సభ్యులకు రుణాలు ఇవ్వనుండగా.. ఉమ్మడి జిల్లాలో సత్తుపల్లి, మధిర, వైరా, కూసుమంచి, భద్రాచలం, పినపాక వ్యవసాయ డివిజన్లలో అవకాశం దక్కనుంది. స్థానిక వాతావరణాన్ని తట్టుకునే జాతుల గేదెలనే రైతులు ఎంపిక చేసుకునేలా పశుసంవర్థక శాఖ పర్యవేక్షణ ఉంటుంది.

పీఏసీఎస్‌ల ద్వారా పాల సేకరణ

రైతులు పాడి యూనిట్ల ద్వారా ఉత్పత్తి చేసే పాలను సైతం పీఏసీఎస్‌ల ద్వారా సేకరిస్తారు. దళారులు లేకుండా వెన్న శాతం ఆధారంగా కొనుగోలు చేయనున్నారు. ఈ ప్రక్రియతో సహకార సంఘాలతో పాటు పాడి రైతులకు ప్రయోజనం కలగనుంది. పాల కొనుగోలుకు అవసరమైన శీతలీకరణ యంత్రాలు, పరికరాలను పీఏసీఎస్‌లు సమకూర్చుకుంటాయి.

కలెక్టర్ అనుమతితో అమలు



చిన్న రైతుల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా పాడి పరిశ్రమ ప్రాజెక్టును రూపొందించాం. సౌకర్యాలు ఉన్న ప్రాంతాల రైతులకు ప్రాధాన్యత ఉంటుంది. సహకార లక్ష్యం నెరవేరేలా పథకాన్ని అమలుచేస్తాం. బ్యాంకు పాలకవర్గం నిర్ణయంతో పాటు కలెక్టర్ అనుమతితో జూన్ నాటికి ఈ ప్రాజెక్టును ప్రారంభించనున్నాం.

–ఎస్.వెంకటఆదిత్య, సీఈఓ, డీసీసీబీ ఖమ్మం

అల్లాడుతున్న మూగజీవాలు



సోములగూడెం వైపు వెళ్లే మార్గంలో బూడిద వాగులో గేదెలు



టేకులపల్లి హైస్కూల్ వద్ద చెట్టు నీడన మూగజీవాలు

పాల్వంచరూరల్/టేకులపల్లి: అధిక ఉష్ణోగ్రతలతో పశువులు, గేదెలు అల్లాడిపోతున్నాయి. ఎండ వేడిమికి బురద, బూడిద నీరు కూడా తాగి దాహార్తి తీర్చుకుంటున్నాయి. ఎక్కడ చెట్లు కనబడితే అక్కడ నీడలో సేదతీరుతున్నాయి. పాల్వంచ మండలం సూరారం, బిక్కుతండా, సోములగూడెం గ్రామాల మీదుగా కేటీపీఎస్ యాష్‌పాండ్‌లోని కలుషితమైన బూడిదనీరు వాగులో ప్రవహించి కిన్నెరసానిలో కలుస్తుంది. వేసవిలో మేతకు వెళ్లిన పశువులు, మేకలు, గొర్రెలు కలుషిత బూడిద నీటిని తాగి దప్పిక తీర్చుకుంటున్నాయి. టేకులపల్లి మండలం తొమ్మిదోమైలుతండా పాఠశాల, టేకులపల్లి హైస్కూల్, తహసీల్దార్ కార్యాలయాల వద్ద భారీ వృక్షాలు ఉండగా, నిత్యం పశువులు చెట్ల కిందకు వచ్చి ఎండ తీవ్రత నుంచి ఉపశమనం పొందుతున్నాయి.

30 కిలోల గంజాయి పట్టివేత



గంజాయి, నిందితులను చూపుతున్న అధికారులు

బూర్గంపాడు: సారపాకలోని ఐటీసీ లారీయార్డులో పార్కింగ్ చేసిన ఓ లారీలో 30 కిలోల గంజాయిని హైదరాబాద్ ఎక్సైజ్ (ఎస్‌టీఎఫ్) అధికారులు ఆదివారం పట్టుకున్నారు. ఐటీసీ పేపర్‌బోర్డుకు జామాయిల్ కర్రను తీసుకొస్తున్న లారీడ్రైవర్ శివ ఒడిశా రాష్ట్రంలో అర్జున్ అనే వ్యక్తిని లారీలో ఎక్కించుకుని సారపాకకు తీసుకొచ్చాడు. ఆ లారీలో గంజాయి ఉందనే పక్కా సమాచారంతో హైదరాబాద్ ఎక్సైజ్ ఎస్ఐ నాగరాజు సిబ్బందితో సారపాకకు చేరుకున్నారు. ఆదివారం సాయంత్రం లారీయార్డులో నిలిపి ఉంచిన లారీని తనిఖీ చేయగా అందులో 30 కిలోల గంజాయి దొరికింది. లారీడ్రైవర్ శివతో పాటుగా ఒడిశాకు చెందిన అర్జున్‌ను అదుపులోకి తీసుకున్నారు.వారిద్దరూ పలుమార్లు లారీలోగంజాయి తీసుకొచ్చి భద్రాచలంలో విక్రయిస్తున్నట్లు విచారణలో తేలింది. గంజాయి విలువ రూ.15 లక్షలు ఉంటుందని, గంజాయితో పాటు లారీని కూడా సీజ్ చేశామని,శివ, అర్జున్‌తో పాటు వచ్చిన ప్రహ్లాద్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్సై నాగరాజు తెలిపారు.